సాక్షి నిజామాబాద్

గురువారం । 23 । జనవరి । 2025



కాలేజీల బంద్!

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే కాలేజీలను నిర్వహించలేమని ప్రైవేట్ కాలేజీల యాజమాన్య ప్రతినిధులు తెలిపారు.

- 8లో ▸



పసుపు ధరపై ఆశలు

జిల్లాలో పసుపు బోర్డు ఏర్పాటు కావడంతో పసుపు పంటకు మంచి ధర పలుకుతుందని రైతులు ఆశలు పెంచుకుంటున్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
33.1 /11.1

ఉదయం మంచు దట్టంగా కురుస్తుంది. చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

రెండో రోజూ నిరసనల జోరు

- అధికారులను నిలదీసిన ప్రజలు
- సంక్షేమ పథకాల జాబితాలో పేర్లు లేవంటూ గగ్గోలు
- వడ్యాట్‌లో అర్ధంతరంగా ముగిసిన సభ
- జిల్లా వ్యాప్తంగా 199 వార్డు, గ్రామ సభలు



కోటగిరి గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

నిజామాబాద్ అర్బన్: ప్రజాపాలన గ్రామ, వార్డు సభలు రెండో రోజు బుధవారం నిరసనలు, నిలదీతల మధ్యే కొనసాగాయి. అధికారులు ప్రకటించిన సంక్షేమ పథకాల ముసాయిదా జాబితాలో తమ పేర్లు లేవంటూ దరఖాస్తు దారులు గగ్గోలు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 199 సభలు జరిగాయి. ఇందులో 159 గ్రామపంచాయతీలు, 40 వార్డులు ఉన్నాయి. మోర్తాడ్ మండలం వడ్యాట్‌లో సభ జరగకుండా అడ్డుకున్నారు. దీంతో అధికారులు అర్ధతరంగానే సభను ముగించారు. నిజామాబాద్‌లోని 41 డివిజన్‌లో జరిగిన వార్డు సభలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జాబితాలో మాజీ కార్పొరేటర్ విశాలిని రెడ్డి పేరు నమోదు కావడంపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. బీజేపీ కార్పొరేటర్ అధికారులను నిలదీశారు. బోధన్ డివిజన్ పరిధిలోని గ్రామసభలలో నిరసనలు ప్రతిధ్వనించాయి. రుద్రూరు మండలం సులేమాన్ ఫారంలో అధికారులను ప్రజలు నిలదీశారు. అర్హుల జాబితాను అడ్డుకున్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల జాబితాలో తమ పేర్లు నమోదు చేయాలని వాగ్వాదానికి దిగారు. ఏసీపీ శ్రీనివాస్ గ్రామ సభకు వచ్చి ప్రజలను సముదాయించారు. సుంకిని, చిక్కడపల్లి గ్రామాల్లో ప్రజలు అధికారులను నిలదీశారు.


ఎడపల్లి : రాణాకలాన్‌లో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు


ఉప్లూర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

న్యూస్‌రీల్

విదేశాలలో ఉద్యోగ అవకాశం

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు విదేశాలలో (ఫిజీ ఐలాండ్) ఉద్యోగాల కోసం ఈ నెల 25న ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి బీపీ మధుసూదన్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టమ్‌కామ్) అనేది తెలంగాణ ప్రభుత్వంలోని కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ కింద రిజిస్టరైన రిక్రూట్‌మెంట్ ఏజెన్సీ. ఈ ఏజెన్సీ ఫిజీ ఐలాండ్‌లో నిర్మాణ, ఐటీ ఫీల్డ్, అకౌంట్స్ విభాగాలలో ఖాళీలు భర్తీ చేయనుంది. కనీస సంబంధిత విద్యార్హత కలిగిన అభ్యర్థులు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నిర్ణీత తేదీన ఎన్రోల్‌మెంట్ డ్రైవ్‌కు హాజరై రెజ్యూమ్‌లను tomcom.resume@gmail. com కు పంపాలి, అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం 94400 49861 / 94400 51452 / 98496 39539 సంప్రదించాలని ఉపాధి కల్పనా అధికారి కోరారు.

ఎన్నికల లబ్ధి కోసమే గ్రామసభలు

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



వేల్పూర్: స్థానిక ఎన్నికల్లో లబ్ధిపొందడానికే కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. బుధవారం వేల్పూర్‌లోని ఆయన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలప్పుడు రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలు, 420 హామీలు వందరోజుల్లో ఇస్తామని ఒట్టేయించుకొని గద్దెనెక్కారన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు చెప్పినోళ్లకే రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు అని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే సంపత్ డైరెక్టుగా చెబుతున్నారని, ఇలాంటప్పుడు గ్రామసభలు ఎందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి సునీల్‌కుమార్ పదేళ్లుగా నామీద విమర్శలు చేస్తూనే ఉన్నాడన్నారు. దానికి బదులు నియోజకవర్గంలో 31 వేల మంది రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేయించాలని, కోడళ్లకు రూ. 2500, అత్తకు రూ. 4 వేలు ఇప్పించాలన్నారు. సమావేశంలో నాయకులు బద్దం ప్రవీణ్ రెడ్డి, నాగధర్‌రెడ్డి, దేవేందర్, దొన్కంటి నర్సయ్య, చౌట్‌పల్లి రవి, ఆర్మూర్ మహేశ్, సామ మహిపాల్, దొల్ల రాజేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావాలి

- సునీల్‌రెడ్డి



మోర్తాడ్(బాల్కొండ): గ్రామ సభలలో ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రజలను రెచ్చగొట్టుడు సరికాదని, దమ్ముంటే ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌రెడ్డి సవాల్ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి సవాల్ విసిరారు. మోర్తాడ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచినా ప్రశాంత్‌రెడ్డికి ప్రజల సమస్యలపై ఎంతమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. పదేళ్లపాటు అధికారంలో ఉండి ఏ ఒక్కరికి కూడా రేషన్ కార్డు ఇవ్వని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు నీతుల వల్లిస్తున్నారని ఎద్దేవా చేశారు. ప్రశాంత్‌రెడ్డికి ఎంత మాత్రం దమ్ము, ధైర్యం ఉన్నా ప్రజలతో కలిసి గ్రామ సభలలో పాల్గొనాలని సూచించారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ పాలెపు నర్సయ్య, ముత్యాల రాములు, సుంకెట్ రవి, సోమ దేవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) శివారులో ఉన్న తెలంగాణ మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో 5వ తరగతి, ఇంటర్ ఒకేషనల్ (ఈటీ, ఎంఎల్‌టీ) గ్రూపులలో మొదటి సంవత్సరం ప్రవేశం కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం రణవీర్ రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే 6, 7, 8వ తరగతులలో బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీకి కేవలం మైనార్టీలు మాత్రమే దరఖాస్తు చేసుకోవలన్నారు. మరిన్ని వివరాలకు 7995057949, 8301242253 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

అర్హులందరికీ లబ్ధి

- ప్రజాపాలన గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలి
- ఆర్మూర్, మోర్తాడ్ మండలాల్లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పర్యటన


ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

ఆర్మూర్, మోర్తాడ్ : సంక్షేమ పథకాల ద్వారా అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహిస్తోందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వెల్లడించారు. ఈ నెల 26 నుంచి ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాల కింద లబ్ధి పొందేందుకు గాను అర్హులైన ప్రతి ఒక్కరు గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్మూర్ మండలం గోవింద్ పేట్, మోర్తాడ్ మండలం సుంకెట్ గ్రామాలలో బుధవారం నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలలో కలెక్టర్ పాల్గొన్నారు. ఆయా పథకాల కింద అర్హులుగా గుర్తించబడిన వారి ముసాయిదా జాబితాను గ్రామ సభలో అందరి సమక్షంలో చదివి వినిపించారు. జాబితాలో పేర్లు లేని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ప్రస్తుతం గ్రామ సభల్లో చదివి వినిపించిన పేర్లు ముసాయిదా జాబితా మాత్రమేనని, ఇందులో అనర్హులు ఉంటే వారి పేర్లను లబ్ధిదారుల జాబితా నుంచి తొలగించనున్నట్లు తెలిపారు. ఇంకనూ ఎవరైనా అర్హులు మిగిలి ఉంటే వారి నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకే ప్రభు త్వం గ్రామ సభలు నిర్వహిస్తోందన్నారు. ఒకవేళ ఏవైనా కారణాల వల్ల గ్రామ సభలలో ఎవరైనా దరఖాస్తులు చేసుకోలేకపోయిన వారు ఈ నెల 24 తర్వాత మండల పరిషత్ కార్యాలయాలలో గల ప్రజాపాలన సేవ కేంద్రాలలో కూడా దరఖాస్తులు అందించవచ్చన్నారు. ఇప్పటి వరకు వివిధ మార్గాల ద్వారా వచ్చిన దర ఖాస్తులను పరిశీలించి రూపొందించిన ముసాయిదా జాబితాను ప్రజల పరిశీలన కోసం గ్రామ పంచాయతీ బోర్డులపై అతికిస్తామన్నారు. జాబితాలో అనర్హులను గుర్తిస్తే ప్రజలు అధికారులకు లిఖితపూర్వకంగా, ఫోన్ ద్వారా, నేరుగా కూడా తెలియజేయవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని, ముసాయిదా జాబితాలో పేర్లు రాని వారు ఎలాంటి ఆందోళనకు, అపోహలకు గురి కావలసిన అవసరం లేదన్నారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇల్లు తదితర పథకాల కోసం వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి, అర్హులందరికీ లబ్ధి చేకూరుస్తామని భరోసా ఇచ్చారు. ఈ మేరకు గ్రామాలలో అర్హులైన వారు ఆయా సంక్షేమ పథకాల కింద దరఖాస్తులు చేసుకునేలా విద్యావంతులు, యువకులు ,గ్రామ పెద్దలు చొరవ చూపాలన్నారు.

సైబర్ మోసాలతో అప్రమత్తంగా ఉండాలి



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఆసరాగా చేసుకుని సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే అవకాశం ఉందని సుంకెట్ గ్రామ సభలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రజలను అప్రమత్తం చేశారు. సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని ఎవరైనా కొత్త ఫోన్ నెంబర్ల నుంచి కాల్ చేస్తే, అలాంటి వారిని నమ్మకూడదని, సంబంధిత అధికారులను సంప్రదించి నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్లో బ్యాంక్ ఖాతా నెంబర్లు, ఓటీపీ నెంబర్లు, ఆధార్ కార్డు నెంబర్లు తెలుపవద్దని జాగ్రత్తలు సూచించారు. గ్రామ సభలలో ఆర్మూర్ ఆర్డీవో రాజాగౌడ్, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస రావు, మోర్తాడ్ ఎంపీడీవో బ్రహ్మానందం, తహసీల్దార్ సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి లక్పతి తదితరులు పాల్గొన్నారు.


మోర్తాడ్ మండలం సుంకెట్‌లో గ్రామ సభకు హాజరైన ప్రజలు, అధికారులు

సజ్జ సాగుకే మొగ్గు..


మోర్తాడ్‌లో ఆరబోసిన సజ్జ పంట (ఫైల్)

- రైతులతో ధర, బైబ్యాక్ ఒప్పందాలకు ముందుకు వస్తున్న సీడ్ వ్యాపారులు
- క్వింటాలుకు రూ.6వేల నుంచి రూ.8,300 వరకు ధర

మోర్తాడ్(బాల్కొండ): విత్తన పంటల సాగులో ముందుండే జిల్లా రైతులు పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు. గడచిన యాసంగి సీజనులో, అంతకు ముందు సజ్జ సాగును తగ్గించి నువ్వుల పంటకు ప్రాధాన్యం ఇచ్చిన రైతులు ఇప్పుడు మనసు మార్చుకున్నారు. అనుకూలమైన వాతావరణం, భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండటంతో సజ్జ సాగుకు మొగ్గుచూపుతున్నారు. క్వింటాలు సజ్జలకు రూ.6 వేల నుంచి రూ.8,300 ధర చెల్లించడానికి వ్యాపారులు ముందుకు వస్తున్నారు. పసుపు తవ్వకాలు మొదలు కావడంతో ఆ వ్యవసాయ క్షేత్రాల్లో రైతులు సజ్జల సాగుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో సజ్జ లేదా నువ్వుల పంటను సాగు చేసేవారు. కొన్నేళ్ల నుంచి సజ్జలకు తగిన ధర లేకపోవడంతో నువ్వుల సాగుకు ప్రాధాన్యం ఇచ్చారు. ఒకప్పుడు 30 వేల ఎకరాల్లో సజ్జలు సాగు చేయగా కొన్నేళ్ల నుంచి 10 వేల ఎకరాలకే పరిమితమైంది. సజ్జలకు క్వింటాలుకు రూ.4,600 మాత్రమే ధర పలకడంతో రైతులు సాగు విస్తీర్ణం కుదించారు. ఇప్పుడు సజ్జలకు కొంత ధర పెరగడంతో ఈ రకం పంటనే సాగు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. ఎర్రజొన్నల సాగు తగ్గడంతో గడ్డి విత్తనాలకు కొరత ఏర్పడే పరిస్థితి కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సీడ్ కంపెనీలు సజ్జల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నాయి.

ధర ఒప్పందంతో పాటు బైబ్యాక్ ఒప్పందాలకు సీడ్ వ్యాపారులు రైతులకు రాతపూర్వకంగా హామీ పత్రాలను రాసి ఇస్తున్నారు. వచ్చే నెలలో సజ్జల సాగు మొదలయ్యే అవకాశం ఉండటంతో గ్రామాలలో పంట ధర, ఇతర ఒప్పందాలు జోరుగా సాగుతున్నాయి.

గతంలో కంటే ధర తగ్గింది..



సజ్జలకు గతంలో కంటే ధర చాలా తగ్గింది. కానీ రైతులు సాగునీటి లభ్యత ఉండటంతో సజ్జ పంటను సాగు చేయాలని ఆలోచన చేస్తున్నారు. వ్యాపారులతో ధర, బైబ్యాక్ ఒప్పందం చేసుకుంటున్నారు. ధర తగ్గినా దిగుబడి పెరిగితే కొంతైనా ప్రయోజనం కలుగుతుంది.

– కె చిన్న రాజేశ్వర్, రైతు, మోర్తాడ్

ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్ పరీక్ష


నగరంలోని అర్సపల్లి పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థులు



గేటు బయట ఆలస్యంగా వచ్చిన అభ్యర్థి

జిల్లా కేంద్రంలో బుధవారం జేఈఈ మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. క్షత్రీయ ఇంజనీరింగ్ కళాశాల, అర్సపల్లిలోని ఏవీ ఎంటర్‌ప్రైజెస్‌లో పరీక్షలు జరిగాయి. అర్సపల్లి కేంద్రంలో ముగ్గురు విద్యార్థులు పరీక్షకు ఆలస్యంగా రాగా అధికారులు అనుమతించలేదు. దీంతో విద్యార్థులు విలపించారు. – నిజామాబాద్ అర్బన్

రోడ్డు భద్రతపై అవగాహన

మోపాల్: రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని మోటార్‌వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, రాహుల్ సూచించారు. మోపాల్ మండలంలోని కంజర్‌లో గల శ్రీసాయివిద్యానికేతన్ పాఠశాలలో రోడ్డు భద్రతపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేలా చూడాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలన్నారు.


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న మోటార్‌వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు

వెయ్యికోట్లు దాటిన రుణాలు

- బ్యాంకు లింకేజీ రుణాల్లో మూడో స్థానంలో నిలిచిన జిల్లా
- మహిళా సంఘాలకు ఇప్పటి వరకు రూ.1058.31 కోట్లు పంపిణీ
- ఎనిమిది మండలాల్లో పూర్తయిన టార్గెట్


బ్యాంకు లింకేజీ రుణంతో ఐలాపూర్‌లో కిరాణా షాపు నడుపుతున్న మంజుల

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీలో అధికారులు లక్ష్యం దిశగా సాగుతున్నారు. మరో రెండు నెలలు గడువు ఉండగానే మహిళా సంఘాలకు 86 శాతానికి పైగా రుణాలు అందించారు. జిల్లాలో ఎనిమిది మండలాలు లక్ష్యానికి మించి మహిళా సంఘాలకు రుణాలు అందించగా, ముప్కాల్ మండలం మొదటి స్థానంలో ఉంది. మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి గాను గ్రామీణాభివృద్ధి శాఖకు రూ.1228.71 కోట్లకు పైగా రుణాలివ్వాలని రాష్ట్ర ప్రభుత్వం టార్గెట్ విధించింది. కొండంత లక్ష్యన్ని చేధించడం కష్టసాధ్యమని సెర్ప్ ఉద్యోగులు తొలుత భావించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విడతల వారీగా మహిళా సంఘాలకు విరివిగా రుణాలు అందిస్తూ వచ్చారు. ఈ ఏడాది మార్చి నాటికి ఆయా మండలాలకు కేటాయించిన టార్గెట్‌ను పూర్తి చేయాల్సి ఉండగా, ఇప్పటికే పలు మండలాలు నూటి శాతానికి మించి రుణాలు అందించి ముందు వరుసలో ఉన్నాయి. మిగతా మండలాలు లక్ష్యానికి చేరువలో ఉన్నాయి. రూ.వెయ్యి కోట్ల మార్క్‌ను దాటి రుణాలు అందించిన గ్రామీణాభివృద్ధి శాఖ జిల్లాను తెలంగాణలో మూడో స్థానంకు తీసుకెళ్లింది.

86 శాతం పంపిణీ..

మొత్తం రూ.1228.71కోట్ల రుణాలు 20,350 మహిళా సంఘాలకు అందించాలని లక్ష్యం ఉంది. ఇప్పటి వరకు 1058.31 (86.13 శాతం) రుణాలను 12,564 సంఘాలకు అందించారు. అయితే సంఘాలకు రుణాలు అవసరం లేకున్నా బలవంతంగా అంటగట్టారనే ఆరోపణలు ఉన్నాయి. బ్యాంకులో పాత రుణాలు తీరకముందే కొత్త రుణాలు అందించడంతో పేద మహిళలకు వాయిదాలు చెల్లించడం కష్టంగా మారింది. ముప్కాల్ మండలం లక్ష్యానికి మించి రూ.23.72కోట్లకు పైగా (122.32శాతం) రుణాలు అందించి టాప్‌లో ఉండగా ధర్పల్లి 48.82 శాతం రుణాలు అందించి చివరిస్థానంలో ఉంది. మార్చి నాటికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఆదేశాలున్నాయి. అధికారుల ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నారు.

లక్ష్యానికి మించి రుణాలిస్తాం



సెర్ప్ శాఖ ఇచ్చిన లక్ష్యాన్ని ఏ మాత్రం భారంగా భావించకుండా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నాం. ఇప్పటికే 86 శాతానికి మించి రుణాలు ఇచ్చాం. మార్చి నాటికి లక్ష్యానికి మించి రుణాలు అందజేసి రాష్ట్ర స్థాయిలో మంచి స్థానాన్ని పొందుతాం. వెనుకబడిన మండలాలు తమ టార్గెట్‌ను పూర్తి చేయాల్సిందే.

– సాయాగౌడ్, డీఆర్‌డీవో

క్లుప్తంగా

నేటి నుంచి ఫుట్‌బాల్ టోర్నమెంట్

నిజామాబాద్ నాగారం: నగరంలోని ఉమెన్స్ కాలేజ్ మైదానంలో నేటి నుంచి ఖేలో ఇండియా అస్మిత టోర్నీలో భాగంగా డాక్టర్ కవిత రెడ్డి ఆధ్వర్యంలో అండర్ 15 బాలికల ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి జావిద్, కోచ్ నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నీలో తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్ రంగారెడ్డి, హైదరాబాద్ ఉమెన్స్ ఫుట్‌బాల్ క్లబ్, ఖమ్మం, ట్విన్ సిటీస్ ఫుట్‌బాల్ క్లబ్ హైదరాబాద్, పీకేఆర్ లెవెన్ మంచిర్యాల్, డీకేఆర్‌ఎఫ్‌సీ నిజామాబాద్, గజ్వేల్ ఎఫ్‌సీ మెదక్ జట్లు పాల్గొంటాయన్నారు. వీరికి లీగ్ కం నాకౌట్ పద్ధతిలో పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటిస్తామన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా



సిరికొండ: వేసవి ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ఉండడానికి చర్యలు చేపట్టినట్లు ట్రాన్స్‌కో డీఈ ఉత్తం జాడే తెలిపారు. మండలంలోని న్యావనంది, దుబ్యాతండా, పందిమడుగు, తాటిపల్లి గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం డీఈ మాట్లాడుతూ.. నిరంతరం విద్యుత్ సరఫరా కోసమే నూతన ట్రాన్స్ ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఏఈ చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్, మహిపాల్, రవీందర్ నాయక్, లైన్‌ఇన్‌స్పెక్టర్ బాలచంద్రన్ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

బాన్సువాడ రూరల్: మండలంలోని జక్కల్‌దాని తండా శివారులో జింకపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. సమీప పంటపొలాల్లోకి వచ్చిన జింకను బుధవారం స్థానిక రైతులు రక్షించారు. దాడి చేసిన కుక్కలను తరిమివేశారు. అనంతరం వారు జింకను బాన్సువాడలోని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. వారు జింకకు ప్రాథమిక చికిత్స అందించి, అడవిలో వదిలిపెట్టారు.

ధర్పల్లి హెచ్‌ఎం సస్పెన్షన్

నిజామాబాద్‌అర్బన్: ధర్పల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జ్యోతిరాణిని సస్పెన్షన్ చేస్తూ ఆర్‌జేడీ కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ధర్పల్లి పాఠశాలలో మధ్యాహ్న భోజనానికి సంబంధించి బియ్యం సరఫరాలో అక్రమాలు, ఉపాధ్యాయులను వేధించడం, తదితర అంశాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై విచారణ జరిపిన అధికారులు నివేదిక సమర్పించగా హెచ్‌ఎంను సస్పెన్షన్ చేస్తూ ఉత్తర్వులు వెలువడినట్లు డీఈవో అశోక్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పరేడ్‌కు ఎంపిక

మాచారెడ్డి: రాష్ట్రంలో జనవరి 26న జరగనున్న రిపబ్లిక్‌డే పరేడ్‌కు మాచారెడ్డి మండలం ఘన్పూర్, సోమారంపేట విద్యార్థులు ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శారద, భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19 నుంచి 24 వరకు ఫైనల్ రిహార్సల్ పరేడ్ జరుగుతుందన్నారు. 26న రాష్ట్ర గవర్నర్ ముందు పరేడ్ చేస్తారని వెల్లడించారు. ఎంపిక కావడంపై కామారెడ్డి స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. కామారెడ్డి జిల్లాకు చెందిన డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కమిషనర్ గోపాల్ కృష్ణ, స్కౌట్స్ అండ్ గైడ్స్ పరేడ్ కాంటింజెంట్‌కి కమాండర్‌గా వ్యవహరిస్తారన్నారు.

పసుపు ధరపై ఆశలు

- బోర్డు ఏర్పాటుతో పంట రేటు పెరుగుతుందంటున్న రైతులు
- ప్రస్తుతం క్వింటాలుకు రూ. 12వేలు వరకు పలుకుతున్న ధైనం

బాల్కొండ: పసుపు బోర్డు ఏర్పాటు కావడంతో పసుపు పంటకు మంచి ధర పలుకుతుందని రైతులు ఆశలు పెంచుకుంటున్నారు. రెండు దశాబ్దాలుగా పసుపు బోర్డు కోసం రైతులు అనేక ఉద్యమాలు చేపట్టారు. ఎట్టకేలకు ఇటీవల నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డును కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈక్రమంలో పసుపు పంటకు మద్దతు ధర క్వింటాలుకు రూ.15వేలు దక్కుతుందని ప్రస్తుతం అన్నదాతలు ఆశిస్తున్నారు. గతంలో పసుపు పంటకు ధర లేకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. గతేడాది పంటకు మంచి ధర దక్కడంతో ప్రస్తుత సంవత్సరం అధికంగా సాగు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 33 వేల ఎకరాల్లో పసుపు సాగు చేశారు. ప్రస్తుతం పసుపు తవ్వకాలు జోరందుకున్నాయి. కొందరు రైతులు ఇదివరకే పసుపు పంటను మార్కెట్‌కు తరలించారు. క్వింటాలకు రూ.11వేల నుంచి రూ.12వేల వరకు మార్కెట్‌లో ధర పలుకుతోంది. రానున్న రోజుల్లో పంటకు మరింత ధర పెరిగే అవకాశం ఉందని రైతులు అనుకుంటున్నారు. క్వింటాలుకు రూ.15 వేలపైనే ధర దక్కుతుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం పసుపు బోర్డు ఏర్పడటంతో ధరపై దడ లేదంటున్నారు.



రెంజర్లలో ఉడికించి ఆరబెట్టిన పసుపు

దిగుబడిపై దిగులు లేదు..

ప్రస్తుత సంవత్సరం పసుపు పంట దిగుబడిపై ఎలాంటి దిగులు లేదని అన్నదాతలు అంటున్నారు. పసుపు పంటకు ప్రధాన తెగుళ్లు ఎక్కువగా సోకకపోవడంతో దిగుబడి ఆశాజనకంగా ఉందంటున్నారు. సాధారణంగా ఎకరానికి ఆరు ట్రాక్టర్ల కొమ్ము, రెండు ట్రాక్టర్ల దుంప వస్తుంది. ప్రస్తుతం అంత కంటే ఎక్కువ కూడా దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పసుపు కొమ్ముల్లో కూడ దుంపకుళ్లు లేకపోవడంతో నాణ్యత బాగానే ఉంది. దీంతో మంచి ధర దక్కుతుందని రైతులు ఆశిస్తున్నారు. గతంలో వర్షపాతం ఎక్కువ కావడంతో పసుపు పంటకు దుంపకుళ్లు, మర్రాకు తెగులు సోకేది. ప్రస్తుత సంవత్సరం అలాంటి పరిస్థితి లేదంటున్నారు.

మంచి ధర దక్కే అవకాశం

పసుపు బోర్డు ఏర్పాటు కావడంతో పంటకు మంచి ధర దక్కుతుందని ఆశిస్తున్నాం. పెరిగిన ఖర్చులతో ఎక్కువ పెట్టుబడి అవసరం అవుతుంది. కనీసం క్వింటాలుకు రూ.15 వేల ధర పలికితే రైతులకు నష్టం ఉండదు.

– రాజేశ్వర్, రైతు

ఏళ్ల నుంచి ఎదురు చూశాం

పసుపు బోర్డు కోసం ఏళ్ల నుంచి ఎదురు చూశాం. ఇప్పుడు బోర్డు ఏర్పాటు కావడంతో ధర పెరుగుతుందని ఆశిస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటాలుకు రూ.11వేలు ధర పలుకుతోంది. మద్దతు ధర క్వింటాలుకు కనీసం రూ.15వేలు ఉంటే పసుపు రైతులకు ఊరట ఉంటుంది.

– రమేష్, రైతు

అయోధ్య రాముడి వార్షికోత్సవం



చద్మల్ తండాలో శోభాయాత్ర నిర్వహిస్తున్న గ్రామస్తులు

జిల్లాలో పలుచోట్ల అయోధ్య రాముడి వార్షికోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్యలో బాలరాముడి విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఏడాది కావస్తున్న సందర్భంగా వేడుకలు జరిపారు. మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. విగ్రహాలతో శోభాయాత్ర చేపట్టారు. పలు చోట్ల అన్నదానం నిర్వహించారు.

– గాంధారి/మద్నూర్/నస్రుల్లాబాద్



నెమ్లిలో దీపారాధన చేస్తున్న మహిళలు

అథ్లెటిక్స్‌లో హోంగార్డు ప్రతిభ



కామారెడ్డి క్రైం: టాటా సంస్థ ఆధ్వర్యంలో ఇటీవల ముంబయిలో నిర్వహించిన అంతర్జాతీయ మారథాన్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా రవాణా శాఖలో హోంగార్డుగా పనిచేస్తున్న అశోక్ పాల్గొని నాలుగో స్థానంలో నిలిచాడు. కలెక్టర్ సంగ్వాన్‌ను ఆయన ఛాంబర్‌లో బుధవారం డీటీవో శ్రీనివాస్ రెడ్డితో కలిసి హోంగార్డు అశోక్ కలిశారు. ఈసందర్భంగా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రోత్సహించిన జిల్లా రవాణా శాఖ అధికారులకు అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. తనకు సూపర్‌న్యూమరీ విధానంలో హోంగార్డు నుంచి కానిస్టేబుల్‌గా పదోన్నతి కల్పించాలని కలెక్టర్, డీటీవోలను అశోక్ కోరారు.

క్రైం కార్నర్

భూ వివాదంతోనే సోదరుడి హత్య

- సుపారీ ఇచ్చిన అన్న
- అన్నారం హత్య కేసును ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఏఎస్పీ చైతన్యరెడ్డి

రామారెడ్డి: రామారెడ్డి మండలంలోని అన్నారం గ్రామంలో ఇటీవల జరిగిన పొక్కలి రవి హత్య కేసును పోలీసులు ఛేదించారు. కుటుంబ సభ్యుల మధ్య నెల కొన్న భూ వివాదం నేపథ్యంలోనే హత్య జరిగినట్లు తెలిపారు. ఈమేరకు రామారెడ్డి పోలీస్ స్టేషన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఏఎస్పీ చైతన్యరెడ్డి వివరాలు వెల్లడించారు. అన్నదమ్ములైన పొక్కలి రవి, పొక్కలి కిష్టయ్యల మధ్య భూమి పంపకాల్లో గొడవలు జరిగాయి. ఈనేపథ్యంలో రవిని హత్య చేయడానికి అన్న కిష్టయ్య పథకం పన్ని, షేక్ ఆఫీజ్, చాకలి నర్సోల్ల రాకేష్‌కు సుపారీ ఇచ్చాడు. దీంతో రవి (41)ని ఈనెల 19న ఇంట్లోనే హత్య చేశారు.



రామారెడ్డి పోలీస్‌స్టేషన్‌లో వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ చైతన్యరెడ్డి

ఏఎస్పీ చైతన్య రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకంగా టీంను ఏర్పాటు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. నిందితులను పట్టుకోగా ఏ–1గా పొక్కలి కిష్టయ్య, ఏ–2గా పొక్కలి కిషన్, ఏ–3గా షేక్ ఆఫీజ్, ఏ–4గా చాకలి నర్సోల్ల రాకేష్, ఏ–5గా పొక్కలి సత్తవ్వపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు తెలిపారు. రూరల్ సీఐ రామన్, రామారెడ్డి ఎస్సై నరేష్, ఏఎస్సై రవీందర్ పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో కౌలురైతు మృతి



మృతిచెందిన సిద్దయ్య

దోమకొండ: మండలంలోని సంఘమేశ్వర్ గ్రామానికి చెందిన మొగుళ్ల సిద్దయ్య(63) అనే కౌలురైతు బుధవారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందినట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి తెలిపారు. సిద్దయ్య గ్రామ శివారులో రెండెకరాల భూమిని కౌలుకు తీసుకుని గత రెండు సంవత్సరాలుగా పంట సాగుచేస్తున్నాడు. ప్రస్తుతం మొక్కజొన్న పంట వేశాడు. అడవి పందుల నుంచి రక్షణ కోసం పంటచుట్టూ సోలార్ విద్యుత్ ఫెన్సింగ్ వేశాడు. రోజుమాదిరిగా బుధవారం తెల్లవారుజామున పంట వద్దకు వెళ్లగా ఒడ్డు వద్ద కాలుజారి సోలార్ ఫెన్సింగ్‌పై పడ్డాడు. దీంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందాడు. మృతుడికి భార్య భీరవ్వతోపాటు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఏఎస్సై వివరించారు.

గుండెపోటుతో జర్నలిస్టు..



లక్ష్మీనారాయణ (ఫైల్)

మాక్లూర్: మాక్లూర్ మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు హిరమోల్ల లక్ష్మీనారాయణ (66) గుండెపోటువచ్చి బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు. జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున తరలివచ్చి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. లక్ష్మీ నారాయణ 1990 నుంచి వివిధ దిన పత్రికల్లో, టీవీ చానల్స్‌లో పని చేశారు.

దుబాయ్‌లో చింతమాన్‌పల్లి వాసి ఆత్మహత్య



స్వామి(ఫైల్)

దోమకొండ: మండలంలోని చింతమాన్‌పల్లి గ్రామానికి చెందిన కొమ్మాట స్వామి(25) అనే యువకుడు దుబాయ్‌లో ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తులు బుధవారం తెలిపారు. ఉపాధి నిమిత్తం గతంలో దుబాయ్ వెళ్లిన స్వామి రెండు నెలల క్రితం తిరిగి గ్రామానికి వచ్చాడు. ఈనెల 12న తిరిగి దుబాయ్ వెళ్లాడు. ఆర్థిక ఇబ్బందులతో అక్కడ ఈనెల 16న తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తోటి కార్మికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. దీంతో కుటుంబసభ్యులు బోరున విలపించారు. మృతుడికి తల్లి లస్మవ్వ, తండ్రి ఆశయ్య ఉన్నారు. మృతదేహం త్వరగా స్వదేశానికి వచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని వారు కోరుతున్నారు.

ఇసుక టిప్పర్, బొలేరో పట్టివేత



పోలీసులు పట్టుకున్న వాహనాలు

రుద్రూర్: పోతంగల్ మండలంలోని మంజీరా నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న బొలేరో, టిప్పర్‌ను పోతంగల్ చెక్ పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఎస్సై సందీప్ బుధవారం తెలిపారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తుండగా మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్ తరలించామని తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం సంబంధిత అధికారులకు సమాచారం అందించినట్లు వివరించారు.

రెంజల్ మండలంలో..

రెంజల్(బోధన్): మండలంలోని బోర్గాం నుంచి తాడ్‌బిలోలి వైపు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బుధవారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తుండటంతో తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించినట్లు పేర్కొన్నారు.

ఎల్లారెడ్డిలో వ్యక్తి అదృశ్యం



రాములు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డికి చెందిన అల్లం రాములు ఈనెల 12వ తేది నుంచి కనిపించడం లేదని ఎస్సై మహేష్ బుధవారం తెలిపారు. రాములు ఇంట్లో గొడవ పడి రాత్రి సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయాడని, ఇప్పటికీ తిరిగిరాలేదన్నారు. కుటుంబసభ్యులు ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించలేదన్నారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జుక్కల్ మండలంలో వివాహిత..

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం ఖండే బల్లూర్ గ్రామానికి చెందిన సిద్దిగొండల ప్రీతిక అనే వివాహిత రెండు రోజుల నుంచి కనిపించడం లేదని ఎస్సై భువనేశ్వర్ బుధవారం తెలిపారు. ఈనెల 21న ప్రీతిక ఇంట్లో నుంచి బయటకు వెళ్లి, ఇప్పటికీ తిరిగి రాలేదన్నారు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. భర్త శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

‘బార్’ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు



బోధన్‌లో క్యారమ్ ఆడుతున్న ఉద్యోగులు

బోధన్: పట్టణంలోని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రిపబ్లిక్ డేను పురస్కరించుకుని బుధవారం న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, సిబ్బందికి క్రీడాపోటీలను ప్రారంభించినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోశెట్టి, కోటేశ్వర్‌రావు తెలిపారు. ఈసందర్భంగా క్యారం, షటిల్, చెస్, మహిళలకు టెన్నికాయిట్, ముగ్గుల పోటీల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. క్యారం పోటీలో సీనియర్ సివిల్ జడ్జి అజయ్‌కుమార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సాయిశివ, స్పెషల్ మెజిస్ట్రేట్ శేషతల్పసాయి, ఏపీవో ఉమేష్ రావులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో..

ఖలీల్‌వాడి: నగరంలోని జిల్లాకోర్టు ప్రాంగణంలో బుధవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళ చెస్, క్యారమ్స్ పోటీలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీతకుంచాల ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మహిళ న్యాయవాదులతో పోటీల్లో పాల్గొని, అనంతరం మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కోర్టు సిబ్బంది, ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహించడంపై హర్షం వ్యక్తం చేశారు. దేశభక్తి గీతాల ఆలాపనలు యువతరంలో దేశభక్తి భావాన్ని పెంపొందించగలవని అన్నారు. న్యాయవాదులు కవిత రెడ్డి, ప్రవీణ,కవిత గంగోనే, ఇందుమతి,అజిత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు రాకుంటే కాలేజీల బంద్



తెయూ వీసీ యాదగిరిరావుకు వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి డబ్బులను విడుదల చేయకపోతే కాలేజీలను నిర్వహించలేమని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజ్ మేనేజ్ మెంట్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు వారు బుధవారం తెలంగాణ యూనివర్సిటీ వీసీ యాదగిరిరావుకు తమ ఆవేదనను వ్యక్తం చేసి, వినతిపత్రం అందజేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల కానీ పక్షంలో కాలేజీలను నిరవధికంగా బంద్ చేస్తామన్నారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు హరిప్రసాద్, సంజీవ్ మాట్లాడుతూ.. తెయూ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు ఎంతో మంది విద్యార్థులకు ఉచితంగా చదువు చెప్పినా, తమకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయకుండా ప్రభుత్వం జాప్యం చేయడం న్యాయం కాదన్నారు. గత సంవత్సర కాలం నుంచి సిబ్బంది జీత భత్యాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లాలని వీసీకి విన్నవించారు. అసోసియేషన్ ప్రతినిధులు మారయ్యగౌడ్, శంకర్, నరాల ధాకర్, జైపాల్ రెడ్డి, బాలాజీ, గిరి, శ్రీనివాస్, సుజన్ రెడ్డి, మలేహ, దుష్యంత్, రమణ పాల్గొన్నారు.

కారుపై విరిగిపడ్డ చెట్టు



చెట్టు కొమ్మలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలోని తిలక్ గార్డెన్ వద్ద బుధవారం సాయంత్రం ఓ చెట్టు అకస్మాత్తుగా విరిగిపడి రోడ్డుపై వెళ్తున్న కారుపై పడింది. ఈ ఘటనలో కారులో ఉన్న ప్రయాణికులకు స్వల్ప గాయాలు అయ్యాయి. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకున్నారు.



రోడ్డుపై పడ్డ చెట్ల కొమ్మలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగగా సిబ్బంది తొలగించారు. కట్టర్ సహాయంతో చెట్టును కట్ చేయించి, ట్రాఫిక్ ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసుల్లో పలువురికి రెండు రోజుల జైలు

ఖలీల్‌వాడి/నందిపేట్/కమ్మర్‌పల్లి: నిజామాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా పలువురు వాహనదారులు మద్యం తాగి నడపడంతో వారిని పట్టుకున్నారు. అనంతరం వారిని కోర్టుల్లో హాజరు పర్చగా కోర్టు వారికి 2రోజుల జైలు శిక్షను విధించింది. నగరంలో పట్టుబడ్డ శంకర్, రాజేష్, సాహెబ్రావ్‌ను నిజామాబాద్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా ఇద్దరికీ 2రోజుల జైలు శిక్ష విధించారు.

నందిపేటకు చెందిన అబ్దుల్ సత్తార్‌కు, కమ్మర్‌పల్లి మండలానికి చెందిన మర్రి అంజయ్యకు ఆర్మూర్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు నిచ్చినట్లు పోలీసులు తెలిపారు.

అర్ధరాత్రి వరకు షాప్ నిర్వహించిన యజమానికి..

ఖలీల్‌వాడి: నగరంలోని ఖిల్లా రోడ్డులో సయ్యద్ మోసిన్(32) తన పాన్‌షాప్‌ను అర్ధరాత్రి వరకు తెరిచినందుకు పోలీసులు అతడిని పట్టుకున్నారు. అనంతరం కోర్టులో అతడిని హాజరుపరుచగా పాన్ షాప్ యజమానికి జడ్జి రెండు రోజులు జైలు శిక్ష విధించినట్లు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్ హెచ్ వో రఘుపతి బుధవారం తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి



నిందితులను చూపుతున్న పోలీసులు

ఖలీల్‌వాడి: నగరంలో కొనసాగుతున్న వ్యభిచార గృహంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం దాడి చేశారు. వినాయక్‌నగర్ పంచముఖి హనుమాన్ మందిరం వెనుక రోడ్ నెంబర్ 7 ప్రాంతంలోని ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు ఏసీపీ నాగేంద్ర చారి ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. నిర్వాహకురాలితో పాటు ఇద్దరు విటులు, ఇద్దరు బాధితురాళ్లను అదుపులోకి తీసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఏసీపీ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5900 నగదు స్వాధీనం చేసుకుని, వారిని నాలుగో టౌన్ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

దుకాణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ రాజావెంకట్‌రెడ్డి

ఖలీల్‌వాడి: జువెల్లర్ దుకాణాల్లో సీసీ కెమెరాలు, హైసెక్యూరిటీ లాక్‌లను ఏర్పాటు చేసుకోవాలని ఏసీపీ రాజావెంకట్ రెడ్డి షాప్ యజమానులకు సూచించారు. నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోల్డ్ షాప్స్ యజమానులతో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దొంగతనాలు, సైబర్ నేరాలపై వారికి అవగాహన కల్పించారు. ఏసీపీ మాట్లాడుతూ.. దుకాణాల వద్ద సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని తెలిపారు. వ్యాపారం ముగిసిన తరువాత గోల్డ్, క్యాష్ సేఫర్‌లో భద్రపర్చాలని, సేఫర్లు ఎవరికీ కనిపించని ప్లేస్‌లో పెట్టాలన్నారు. డిజిటల్ ట్రాన్సక్షన్స్ మాత్రమే చేయాలని తెలిపారు. సీసీటీవీ కెమెరాలు బిగించి, క్లౌడ్‌స్టోరేజ్‌కి అనుసంధానం చేయాలన్నారు. షాప్‌లల్లో అలారం సిస్టంను బిగించుకొని, స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేయాలన్నారు. క్యాష్, గోల్డ్ తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకర్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

నలుగురి బైండోవర్

భిక్కనూరు: పోలీస్ విధులకు ఆటంకం కలిగించిన నలుగురిని బైండోవర్ చేసినట్లు ఎస్సై ఆంజనేయులు బుధవారం తెలిపారు. భిక్కనూర్‌కు చెందిన చేపూరి భాను, బండి నరేష్, రామేశ్వర్‌పల్లికి చెందిన బోయిని కనకరాజు, మెదక్ జిల్లా కొండాపూర్‌కు చెందిన వర్దం నర్సింలు ఇటీవల అనవసరంగా పలుమార్లు డయల్ 100కు కాల్ చేసి, పోలీసు విధులకు అంతరాయం కలిగించారని తెలిపారు. దీంతో వారిని తహసీల్దార్ శివప్రసాద్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్సై తెలిపారు.